క్లుప్తంగా

సైబర్ నేరాల నియంత్రణకు కృషి చేయాలి

సూర్యాపేట : సైబర్ నేరాల నియంత్రణకు కృషి చేయాలని జిల్లా సైబర్ సెక్యూరిటీ డీఎస్పీ శ్రీనివాసరావు పోలీస్ సిబ్బందికి పిలుపునిచ్చారు. సైబర్ మోసాల నివారణపై శనివారం జిల్లా పోలీస్‌కార్యాలయంలో సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సమాజంలో సాంకేతికత పెరిగి అదే స్థాయిలో ఆన్‌లైన్ ఆర్థిక మోసాలు అధికమయ్యాయని పేర్కొన్నారు. సామాజిక మాధ్యమాలకు బలమైన పాస్‌వర్డ్ పెట్టుకోవాలని, పుట్టిన తేదీలు, ఫోన్ నంబర్ లాంటివి పెట్టుకోవడం వల్ల మన ఫేస్‌బుక్ లాంటి సోషల్ మీడియా అకౌంట్లను సైబర్ మోసగాళ్లు హ్యాక్ చేస్తున్నారన్నారు. అలాగే మొబైల్‌లో యాప్స్ డౌన్లోడ్ చేసే క్రమంలో ఫోన్ అనుమతులు ఇవ్వడం వల్ల కూడా సైబర్ మోసాలకు గురవుతామని చెప్పారు. కార్యక్రమంలో సైబర్ సెక్యూరిటీ ఇన్‌స్పెక్టర్ లక్ష్మీనారాయణ, ఆర్ఎస్ఐ అన్వర్, కళాబృందం సభ్యులు, ఆర్మ్‌డ్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్ఐపై కోర్టు ధిక్కరణ కేసు

సూర్యాపేట : కోర్టు ఆర్డర్ లెక్క చేయకుండా బాధితులపై కేసు నమోదు చేసిన నాటి సూర్యాపేట రూరల్, ప్రస్తుతం ట్రాఫిక్ ఎస్ఐగా పని చేస్తున్న రావులకొల్ల సాయిరాంపై కంటెంట్ ఆఫ్ కోర్టు కేసు నమోదైంది. ఈ మేరకు హైకోర్టులో మే 1న వివరణ ఇవ్వాలని కోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. వివరాలు ఇలా ఉన్నాయి. బాలెంల రెవెన్యూ పరిధిలోని ఓ భూ వివాదానికి సంబంధించి ముప్పిడి సుధాకర్, వారి కుటుంబ సభ్యులపై అక్రమ కేసులు బనాయించడంతో బాధితులు హైకోర్టును ఆశ్రయించారు. దీంతో కోర్టు పరిధిలో ఉన్న సివిల్ మాటర్స్‌లో పోలీసులు జోక్యం చేసుకోవద్దని కోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. ఎస్ఐ సాయిరాం కోర్టు ఉత్తర్వులను లెక్క చేయకుండా ముప్పిడి సుధాకర్, వారి కుటుంబ సభ్యులపై తిరిగి మరోసారి అక్రమ కేసులు నమోదు చేశారు. దీంతో బాధితులు తిరిగి హైకోర్టును ఆశ్రయించారు. కోర్టు ఇచ్చిన ఆర్డర్‌ను లెక్క చేయకుండా కేసు నమోదు చేసిన ఎస్ఐ సాయిరాంపై హైకోర్టులో కోర్టు ధిక్కారం కంటెంట్ కింద కేసు నమోదైంది. ఎస్ఐకు నోటీసులు ఇచ్చింది.

ఓఆర్ఎస్ ప్యాకెట్ల పంపిణీ

తిరుమలగిరి : ప్రతి గ్రామంలో ఓఆర్ఎస్ డిపో ఏర్పాటు చేసి ప్రజలందరికీ ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని జిల్లా వైద్యాధికారి కోటాచలం సూచించారు. శనివారం తిరుమలగిరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. కొన్ని రోజులుగా అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయని, ప్రజలకు వడదెబ్బపై అవగాహన కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రోగ్రాం అధికారులు డాక్టర్ సాహితి, డాక్టర్ వెంకటరమణ, చంద్రశేఖర్, మల్లెల వందన, వీరయ్య, సతీష్, కిరణ్, బిచ్చునాయక్, స్వరూపాకుమారి పాల్గొన్నారు.

అర్వపల్లి : వడదెబ్బ బారిన పడకుండా రైతులు, హమాలీలు తగు జాగ్రత్తలు తీసుకోవాలని రామన్నగూడెం గ్రామ పంచాయతీ కార్యదర్శి ఉపేందర్‌రావు కోరారు. శనివారం రామన్నగూడెంలోని సెర్ప్ ధాన్యం కొనుగోలు కేంద్రంలో వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో రైతులు, హమాలీలకు ఓఆర్ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీహెచ్ఏ గిరిజ, ఆశ కార్యకర్త శైలజ, మహిళలు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయాలు

నూతనకల్ : మండల కేంద్రంలో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తికి గాయాలయ్యాయి. ఎస్ఐ సైదులు తెలిపిన వివరాల ప్రకారం.. కృష్ణా జిల్లా నందిగామకు చెందిన వెంకట్ బతుకుదెరువు కోసం మద్దిరాల మండలం పోలుమళ్ల గ్రామంలో మామిడితోటలు కౌలుకు తీసుకొని జీవనం సాగిస్తున్నాడు. వ్యక్తిగత పనుల నిమిత్తం నూతనకల్ మండల కేంద్రానికి బైక్‌పై వస్తున్న సమయంలో సూర్యాపేట వైపు వెళ్తున్న టాటా ఏస్ వాహనాన్ని వెనుక నుంచి ఢీకొట్టి కిందపడ్డాడు. దీంతో అతడి కాలు విరిగింది. అతడిని చికిత్స నిమిత్తం సూర్యాపేట ఏరియా ఆస్పత్రికి తరలించారు. కాగా.. బాధితుడి నుంచి ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్ఐ తెలిపారు.

లారీ, బస్సు ఢీ

పెన్‌పహాడ్ : మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ వద్ద శనివారం లారీ, బస్సు ఎదురెదురుగా ఢీకొన్నాయి. స్థానికులు తెలిపిన ప్రకారం.. సూర్యాపేట నుంచి మిర్యాలగూడ వైపు వరిపొట్టు లోడుతో వెళ్తున్న లారీ, మిర్యాలగూడ నుంచి సూర్యాపేట వైపు వెళ్తున్న ఆర్టీసీ అద్దె బస్సు పెన్‌పహాడ్‌లోని పోలీస్ స్టేషన్ మూలమలుపు వద్ద ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ఘటనలో ఎవరికి ఎలాంటి గాయాలు కాలేదు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

పెన్‌పహాడ్ : పెన్‌పహాడ్ సబ్‌స్టేషన్ పరిధిలోని పెన్‌పహాడ్ ఫీడర్ లైన్ల కింద ఉన్న చెట్ల కొమ్మలు, చీదెళ్ల సబ్ స్టేషన్ పరిధిలోని తంగెళ్లగూడెం ఫీడర్ లైన్ల కింద ఉన్న చెట్ల కొమ్మలు తొలగించనున్నందున ఆదివారం పెన్‌పహాడ్, తంగెళ్లగూడెంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఇన్‌చార్జ్ విద్యుత్ ఏఈ రమేష్ శనివారం తెలిపారు. ఉదయం 7గంటల నుంచి 10గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని తెలిపారు.

మద్దిరాల : మండల కేంద్రంలోని 11కేవీ ఫీడర్ కింద గల చెట్ల కొమ్మలను తొలగిస్తుండడం, మండల కేంద్రంలో విద్యుత్ స్తంభాలకు బల్బులు వేస్తుండడం వల్ల ఆదివారం మద్దిరాలలో ఉదయం 6గంటల నుంచి 10గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ ఏఈ సురేందర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. గమనించగలరని కోరారు.

చిరు వ్యాపారులకు వడ్డీల మోత!

- అనుమతులు లేకుండా డైలీ ఫైనాన్స్ వ్యాపారం
- పెద్ద మొత్తంలో వడ్డీలు వసూలు చేస్తూ లక్షల రూపాయల టర్నోవర్
- చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్న సంబంధిత అధికారులు



తిరుమలగిరి : చిరు వ్యాపారుల అవసరాలను ఆసరాగా చేసుకొని డెయిలీ ఫైనాన్స్ వ్యాపారులు జేబులు నింపుకుంటున్నారు. తిరుమలగిరి మున్సిపాలిటీ, మండలంలోని గ్రామాల్లో ఈ తరహా వ్యాపారం మూడు పువ్వులు, ఆరు కాయలుగా విరాజిల్లుతోంది. చిల్లర వ్యాపారులకు, ఆటో యాజమాన్యాలకు, డ్రైవర్లకు, కిరాణ దుకాణదారులకు కూరగాయలు, పండ్లు, పూల వ్యాపారులకు కొంత మంది వడ్డీ వ్యాపారులు డెయిలీ ఫైనాన్స్ ఇచ్చి జేబులు నింపుకుంటున్నారు. అయితే అధిక వడ్డీ అయినప్పటికీ విధి లేని పరిస్థితిలో చిరు వ్యాపారులు డబ్బులు తీసుకుంటున్నారు.

5నుంచి 10శాతం వరకు వడ్డీ..

మండలంలో పలువురు డైలీ ఫైనాన్స్ నిర్వాహకులు లైసెన్సులు లేకుండానే వ్యాపారాన్ని విచ్చలవిడిగా సాగిస్తున్నారు. ఈ తరహా వ్యాపారాన్ని అరికట్టాల్సిన అధికారులు ప్రేక్షక పాత్ర వహిస్తున్నారని ఆయా గ్రామాల ప్రజలు చర్చించుకుంటున్నారు. మండలంలో డెయిలీ ఫైనాన్స్ లక్షల రూపాయల టర్నోవర్ జరుగుతోంది. చిరు వ్యాపారుల అవసరాలను బట్టి 5 నుంచి 10 శాతం వరకు వడ్డీ తీసుకుంటున్నారు. తీసుకున్న డబ్బులు సకాలంలో చెల్లించకుంటే అపరాధ రుసుం వసూలు చేస్తున్నారు. ఒక్కసారి రుణం తీసుకుంటే కొన్ని నెలల పాటు అప్పు తీర్చాల్సిన పరిస్థితి వస్తోందని చిరు వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ముందుగానే వడ్డీల వసూలు..

డైలీ ఫైనాన్స్ నిర్వాహకులు చిరు వ్యాపారులకు అప్పు ఇచ్చే మొత్తంలో ముందుగానే పది శాతం వడ్డీ పట్టుకుంటున్నారు. అంతే కాకుండా వారం రోజుల వాయిదా డబ్బులను ముందుగా తీసుకుంటారు. మిగిలిన మొత్తాన్ని 100 రోజుల్లో చెల్లించాలి. ఒకవేళ గడువు దాటితే అదనంగా వసూలు చేస్తారు. రూ.20 వేలు అప్పు తీసుకుంటే ముందుగానే రూ.2 వేలు పట్టుకుంటారు. మరి కొంత మంది వ్యాపారులు బంగారు ఆభరణాలు, పొలాలకు సంబంధించిన పత్రాలు ఉంచుకొని అధిక వడ్డీకి డబ్బులు ఇస్తున్నారు. తిరుమలగిరి మండలంలో ప్రతి నెలా సుమారు రూ.5 కోట్ల వరకు ఈ వ్యాపారం సాగుతోంది. దీంతో పాటు కొద్ది మంది చిట్టీల వ్యాపారం కూడా కొనసాగిస్తున్నారు. గతంలో పలువురు చిట్టీల వ్యాపారులు చిరు వ్యాపారుల వద్ద నెల నెలా డబ్బులు తీసుకొని చిట్టీ డబ్బులు ఇవ్వకుండానే ఉడాయించిన సంఘటనలు కూడా ఉన్నాయి. తిరుమలగిరి పాత గ్రామానికి చెందిన పలువురు చిరు వ్యాపారులు ఈ అక్రమ వడ్డీ వ్యాపారులపై అధికారులపై ఫిర్యాదులు కూడా చేశారు. ఇటీవల మాలిపురంలో వడ్డీ వ్యాపారుల వేధింపులు తాళలేక బాధితులు ఆత్మహత్యలు చేసుకున్న సంఘటనలు కూడా చోటు ఉన్నాయి.

అనుమతులు లేకుండానే..

సాధారణంగా చిట్టీలు, ఫైనాన్స్‌లు నిర్వహించే వారు రిజిస్ట్రార్ నుంచి అనుమతులు తీసుకోవాల్సి ఉంటుంది. చట్ట ప్రకారం వడ్డీ వ్యాపారం నిర్వహించాలంటే తెలంగాణ మనీ లాండరింగ్ చట్టం ప్రకారం స్థానిక తహసీల్దార్ నుంచి అనుమతులు తీసుకోవాలి. కానీ ఏ ఒక్కరికి కూడా ఎలాంటి అనుమతులు లేవు. ప్రామిసరీ నోట్లు, బ్యాంక్ చెక్కు, తెల్ల కాగితాలపై సంతకాలు చేయించుకొని డబ్బులను వడ్డీలకు ఇస్తున్నారు. ఈ దారుణాలను అరికట్టడంలో అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారని ఆయా గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు అధిక వడ్డీ వ్యాపారులపై చర్యలు తీసుకొని ప్రజలకు మేలు చేయాలని కోరుతున్నారు.

కేసులు నమోదు చేస్తాం



వడ్డీ వ్యాపారుల నుంచి ఇబ్బందులు, వేధింపులు ఉంటే పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలి. ఫిర్యాదుల ఆధారంగా కేసులు నమోదు చేస్తాం. అనుమతులు లేకుండా, నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే కేసులు నమోదవుతాయి.

– సత్యనారాయణ, ఎస్ఐ, తిరుమలగిరి

నీటితొట్లకు మరమ్మతు.. నీటి సరఫరా



కొమ్మాలలో నీటితొట్టికి మరమ్మతు చేయిస్తున్న అధికారులు, సిబ్బంది



అర్వపల్లిలోని సంతలో నీటి తొట్టిలోకి నీటిని నింపిస్తున్న ఎంపీడీఓ సందీప్‌కుమార్

సాక్షి ఎఫెక్ట్..

అర్వపల్లి : వేసవి నందు గ్రామాల్లో పశువులు, మూగజీవాలకు దాహార్తిని తీర్చడం కోసం గతంలో నిర్మించిన నీటి తొట్లు నిరుపయోగంగా మారా యి. దీంతో ఎండలకు దాహంతో మూగజీవాలు అల్లాడిపోతున్నాయి. అయితే ఈ విషయాన్ని తొట్లు ఇలా.. పశువులకు నీరెలా? అనే శీర్షికన శనివారం సాక్షిలో ప్రచురితమైన కథనానికి జిల్లా కలెక్టర్ స్పందించారు. వెంటనే నీటి తొట్లను వినియోగంలోకి తెచ్చి మూగజీవాల దాహం తీర్చాలని మండల అధికారులను ఆదేశించారు. దీంతో ఇన్‌చార్జ్ ఎంపీడీఓ డి.సందీప్‌కుమార్ వెంటనే వివిధ గ్రామాలను సందర్శించారు. కొమ్మాల, అర్వపల్లి తదితర గ్రామాల్లో శిథిలమైన ట్యాంకులను మరమ్మతు చేయించి నీటితో నింపించారు. అన్ని గ్రామాల్లో నీటితొట్లను వినియోగంలోకి తెచ్చేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఈ కార్యక్రమంలో గిర్దావర్ కరుణాకర్, ప్రత్యేక అధికారి చరణ్, పంచాయతీ కార్యదర్శులు నారాయణమూర్తి, శ్రావణి, గ్రామపంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

స్వతంత్ర అభ్యర్థిగా గెలిపించాలి

భానుపురి : స్వతంత్ర ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న తనను గెలిపించాలని రిటైర్డ్ ఐఏఎస్ అధికారి చొల్లేటి ప్రభాకర్ కోరారు. శనివారం పట్టణంలోని తెలంగాణ తల్లి విగ్రహం వద్ద ఎన్నికల ప్రచార కరపత్రాలను ఆవిష్కరించి మాట్లాడారు. ప్రజాస్వామ్య దేశంలో అంబేద్కర్ రాజ్యాంగాన్ని రచించి ప్రపంచ మేధావిగా గుర్తింపు పొందాడన్నారు. 18వ లోక్‌సభ ఎన్నికలకు స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ వేశానని తెలిపారు. రాజకీయ పార్టీలు డబ్బున్న వాళ్లకు మాత్రమే టికెట్లు ఇస్తున్నాయని విమర్శించారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ప్రిన్సిపాల్ జి.నాగయ్య, చొల్లేటి రాజేశ్వరి, మునగాల రమణ పాల్గొన్నారు.



ప్రచార కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ప్రభాకర్

ఆస్పత్రి అభివృద్ధికి ప్రభుత్వం కృషి



మాట్లాడుతున్న ఎంపీడీఓ వెంకటేశ్వరరావు

పెన్‌పహాడ్ : ఆస్పత్రి అభివృద్ధి కోసం ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందని ఎంపీడీఓ వెంకటేశ్వరరావు అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జన ఆరోగ్య సమితి సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఆస్పత్రిలో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామని తెలిపారు. మూత్రశాలలు, రోగులకు కావాల్సిన తాగునీటి వసతి, వాటర్ సప్లయ్ కోసం కొత్త పైప్‌లైన్, సమావేశ మందిరానికి ఫర్నిచర్ సమకూర్చడం, ఆస్పత్రికి ఇంటర్నెట్ సౌకర్యం తదితర అంశాలపై తీర్మానించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల వైద్యాధికారి స్రవంతి, మండల విద్యాధికారి నకిరేకంటి రవి, సీహెచ్ఓ సునంద, పీహెచ్ఎన్ అనంతలక్ష్మి, సూపర్‌వైజర్ శ్రీలక్ష్మి, హెచ్ఈఓలు చంద్రశేఖరరాజు, భూతరాజు సైదులు, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు వెంకటమ్మ, హనీఫా, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రంలో 'గ్రాడ్యుయేషన్ డే'



గానుగుబండలో విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న సూపర్‌వైజర్ ప్రమీల

తుంగతుర్తి : గానుగుబండ గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో గ్రాడ్యుయేషన్ డే వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ప్రమీల మాట్లాడారు. పిల్లలకు జీవితంలో మొదటి ఆరు సంవత్సరాలు చాలా కీలక దశ అని అన్నారు. ఈ దశలో పిల్లలకు అందించే ప్రేరణ వారి భవిష్యత్తుకు, సంపూర్ణ అభివృద్ధికి, వ్యక్తిత్వ వికాసానికి పునాది వేస్తుందని పేర్కొన్నారు. అనంతరం చిన్నారుల తల్లులకు పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. పిల్లల బరువులు తూకం వేసి, ప్రోగ్రెస్ రిపోర్టులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్ జి.శోభ, ఉపాధ్యాయులు శ్యాంసుందర్, సరిత, ఫిరోజ్‌బేగం, ఆయా మణెమ్మ, ప్రమీల, ఉష, నవ్య పాల్గొన్నారు.

రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలి



అర్వపల్లి : అడివెంలలో కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న మండల ప్రత్యేక అధికారి శ్రీధర్‌రెడ్డి



నాగారం : పసునూర్‌లో ఐకేపీ కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ బ్రహ్మయ్య

అర్వపల్లి : ధాన్యం కొనుగోళ్లలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు ఎదురు కాకుండా చూడాలని మండల ప్రత్యేక అధికారి జి. శ్రీధర్‌రెడ్డి కోరారు. శనివారం అడివెంల గ్రామంలో సెర్ప్ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి ధాన్యంలో తేమ శాతాన్ని పరిశీలించారు. రైతులు ధాన్యాన్ని ఆరబెట్టి, శుభ్రం చేసి తెస్తే వెంటనే కొనుగోలు చేస్తామని చెప్పారు. మద్దతు ధర దక్కాలంటే 17 శాతంలోపు తేమ ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఓ రావి శోధర్‌రెడ్డి, ఏఈఓ నేరెళ్ల సత్యం, కేంద్రం నిర్వాహకురాలు భవాని, రైతులు పాల్గొన్నారు.

వేగవంతంగా పూర్తి చేయాలి

నాగారం : ధాన్యం కొనుగోళ్లను వేగవంతంగా పూర్తి చేయాలని స్థానిక తహసీల్దార్ బ్రహ్మయ్య అన్నారు. శనివారం మండల పరిధిలోని పసునూర్, పస్తాల గ్రామాల్లోని ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆకస్మికంగా సందర్శించి మాట్లాడారు. ధాన్యం కొనుగోళ్లలో నిర్వాహకులు నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కొనుగోలు కేంద్రాలకు వచ్చిన ధాన్యాన్ని కాంటాలు వేసి వివరాలను వెంటనే ట్యాబ్‌లలో నమోదు చేయాలని సూచించారు. రైతులు శుభ్రం చేసిన ధాన్యాన్ని కేంద్రాలకు తేవాలన్నారు. నాగారంబంగ్లా సమీపంలోని వాసవీ రైస్ మిల్లును సందర్శించి ధాన్యం దిగుమతు, ఎగుమతులపై ఆరాతీశారు. కొనుగోలు కేంద్రాల నుంచి వచ్చే ధాన్యాన్ని వెంటనే దిగుమతి చేసుకోవాలని మిల్లర్లకు సూచించారు. కార్యక్రమంలో ఏపీఎం శోభారాణి, రెవెన్యూ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

మద్దిరాల : కొనుగోలు కేంద్రాల్లో 17శాతంలోపు తేమ వచ్చిన ధాన్యానికి వెంటనే కాంటాలు వేయాలని తహసీల్దార్ అమీన్‌సింగ్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రంలో ధాన్యం కాంటాలను పరిశీలించారు. కార్యక్రమంలో ఏఓ వికాస్ పాటిల్, ఏపీఎం మైసయ్య, సీసీ నాగార్జున్‌రెడ్డి, రైతులు పోలోజు సైదులు, వీఓఏలు తదితరులు పాల్గొన్నారు.

రైతులను ఇబ్బందులకు గురిచేయొద్దు

ఆత్మకూర్(ఎస్) : ధాన్యం కొనుగోలు కేంద్రాలలో రైతులను ఇబ్బందులు పెడితే చర్యలు తప్పవని సూర్యాపేట ఆర్డీఓ వేణుమాధవ్‌రావు అన్నారు. శనివారం దాచారం, ఆత్మకూరు, నెమ్మికల్లు, ఏనుబాముల గ్రామాల్లోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను వారు తనిఖీ చేశారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలలో సరైన వసతులు కల్పించాలని అన్నారు. క్రయ, విక్రయ రికార్డుల నిర్వహణ సక్రమంగా లేదని సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతిరోజు తేమ శాతం చూసి రికార్డుల్లో నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి నాగేశ్వరశర్మ, తహసీల్దార్ వినోద్‌కుమార్, వ్యవసాయ అధికారిణి దివ్య, ఏపీఎం మంజుల, ఏఈఓలు శైలజ, శివకుమార్, సీఈఓ పల్లం లక్ష్మారెడ్డి, సీసీ చందు, రైతులు తదితరులు పాల్గొన్నారు.



ఆత్మకూరులోని పీఏసీఎస్ కొనుగోలు కేంద్రంలో మాట్లాడుతున్న ఆర్డీఓ



మద్దిరాల గ్రామంలోని ఐకేపీ కేంద్రంలో ధాన్యాన్ని కాంటా వేయిస్తున్న తహసీల్దార్ అమీన్‌సింగ్

భువనగిరిలో కాంగ్రెస్ జెండా ఎగరడం ఖాయం



తుంగతుర్తిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మందుల సామేల్



నాగారం : పస్తాలలో బొడ్రాయి వద్ద పూజలు చేస్తున్న ఎమ్మెల్యే సామేల్

తుంగతుర్తి : భువనగిరి ఖిలాపై కాంగ్రెస్ జెండా ఎగరడం ఖాయమని స్థానిక ఎమ్మెల్యే మందుల సామేల్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం పూర్తిగా అవినీతి, అక్రమాలకు పాల్పడిందని అన్నారు. ప్రాజెక్టుల పేరుతో లక్షల కోట్లు దోచుకొని రాష్ట్రాన్ని కేసీఆర్ అప్పుల పాలు చేశాడని తెలిపారు. తెలంగాణలో బీజేపీకి స్థానం లేదని, బీఆర్ఎస్ పని ఖతమైందన్నారు. ఆదివారం భువనగిరి పార్లమెంట్ స్థానానికి కాంగ్రెస్ అభ్యర్థి శ్యామల కిరణ్ కుమార్‌రెడ్డి వేసే నామినేషన్ కార్యక్రమాన్ని పార్టీ కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ నామినేషన్ కార్యక్రమానికి ముఖ్యమంత్రితోపాటు జిల్లా మంత్రులు, భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, ఎమ్మెల్యేలు పెద్ద ఎత్తున హాజరవుతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు చెవిటి వెంకన్న యాదవ్, నాయకులు దొంగరి గోవర్దన్, పాలకుర్తి రాజయ్య, రాములు, తొడుసు లింగయ్య, పసుల అశోక్, కొండరాజు, గంగరాజు, రాంబాబు, సుధాకర్, సుమతి, సత్తమ్మ, కార్యకర్తలు పాల్గొన్నారు.

మృతురాలి కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ

మండల పరిధిలోని కొత్తగూడెం గ్రామానికి చెందిన చెర్విరాల ఉపేంద్ర ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. ఈ సందర్భంగా స్థానిక ఎమ్మెల్యే మందుల సామేల్ శనివారం ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు దొనకొండ రమేష్, దొంగరి గోవర్దన్, ఓర్సు వెంకన్న, లింగయ్య, లక్ష్మయ్య, రాజయ్య, విజయ్, అయోధ్య పాల్గొన్నారు.

బొడ్రాయి వద్ద ఎమ్మెల్యే పూజలు

నాగారం : పస్తాల గ్రామంలో బొడ్రాయి వార్షికోత్సవం, శ్రీ కంఠమహేశ్వర స్వామి ఉత్సవాలను శనివారం వైభవంగా నిర్వహించారు. వేడుకల్లో స్థానిక ఎమ్మెల్యే మందుల సామేల్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గ్రామాల్లో ఉత్సవాలు జరుపుకోవడంతో ప్రజల్లో ఐకమత్యం పెంపొందుతుందన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ బండగొర్ల నరేష్, వడ్లకొండ వెంకన్న, గ్రామస్తులు, గౌడ భక్తులు పాల్గొన్నారు.

పార్లమెంటు ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థిదే గెలుపు

తిరుమలగిరి : భువనగిరి పార్లమెంటు ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి బూర నర్సయ్య గౌడ్ విజయం ఖాయమని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కడియం రామచంద్రయ్య అన్నారు. శనివారం తొండ గ్రామంలో ఇంటింటికీ తిరిగి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పది సంవత్సరాల కాలంలో ప్రధాని నరేంద్రమోదీ దేశాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లాడని తెలిపారు. అన్ని వర్గాల సంక్షేమమే ధ్యేయంగా పని చేశారని పేర్కొన్నారు. బీజేపీ అభ్యర్థిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఆయన వెంట పార్టీ మండల అధ్యక్షుడు బంగారు రాజు, దీన్‌దయాళ్, యాదగిరి, సోమయ్య తదితరులు పాల్గొన్నారు.



ప్రచారం నిర్వహిస్తున్న కడియం రామచంద్రయ్య

నేటి నుంచి ఉత్సవాలు

చిలుకూరు: నారాయణపురంలో నూతనంగా నిర్మించిన కనకదుర్గమ్మ దేవాలయంలో ఆదివారం నుంచి విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఆలయంలో కనకదుర్గమ్మ, గణపతి, సుబ్రహ్మణ్యస్వామి విగ్రహాలు, నవగ్రహ, జీవ ధ్వజస్తంభ శిఖర ప్రతిష్ఠాపన ఉన్నట్లు ఆలయ కమిటీ సభ్యులు శనివారం తెలిపారు. 21వ తేదీన విగ్రహాల ఊరేగింపు, 22న విఘ్నేశ్వర పూజ, పుణ్యావచనం, యాగశాల ప్రవేశం, 23న జలాధివాసం, కుంకుమ పూజ, 24న యంత్ర స్థాపన, కనకదుర్గమ్మ విగ్రహ ప్రతిష్ఠ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలకు మౌలిక వసతులు

- సర్కార్ బడుల్లో ప్రారంభమైన మరమ్మతులు
- జాజిరెడ్డిగూడెం మండలానికి రూ.30.40 లక్షల నిధులు
- అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ద్వారా పనులు



బొల్లంపల్లి గ్రామంలోని పాఠశాలలో కొనసాగుతున్న ఎలక్ట్రికల్ పనులు




సీతారాంపురం పాఠశాలలో మరుగుదొడ్డి మరమ్మతు

అర్వపల్లి : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు తాగునీరు, మరుగుదొడ్లు, విద్యుత్ తదతర మౌలిక సదుపాయాలు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. కొన్ని పాఠశాలల్లో అరకొర వసతులతోనే నెట్టుకొస్తున్నారు. గత ప్రభుత్వం తీసుకొచ్చిన మన ఊరు–మన బడి పథకంతో కొన్ని పాఠశాలల్లో కొంతమేర వసతులు ఏర్పాటు చేసినా, మిగిలిన పాఠశాలల్లో సమస్యలు తప్పడం లేదు. ఈ నేపథ్యంలో ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో కనీస వసతులు కల్పించేందుకు నిధులు విడుదల చేశారు. అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీలకు అభివృద్ధి పనుల నిర్వహణ బాధ్యతలను అప్పగించారు. కమిటీలతో పాటు ప్రధానోపాధ్యాయులు పాఠశాలల్లో పనులను చేపడుతున్నారు.

19 పాఠశాలల్లో పనులు..

జాజిరెడ్డిగూడెం మండలంలోని 19 పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు రూ.30.40 లక్షలు మంజూరు కాగా పనులు చేపడుతున్నారు. సీతారాంపురం ప్రాథమిక పాఠశాలకు రూ.1.35లక్షలు, బొల్లంపల్లికి రూ.1.60 లక్షలు, పర్సాయపల్లి జెడ్పీహెచ్ఎస్‌కు రూ.1.60 లక్షలు, పడమటితండాకు రూ.1.35లక్షలు, కొమ్మాల జెడ్పీహెచ్ఎస్‌కు రూ.5లక్షలు, కొమ్మాల ప్రాథమిక పాఠశాలకు రూ.1.60 లక్షలు, కొమ్మాల ఆవాసం కొత్తగూడెం పాఠశాలకు రూ. 1.35 లక్షలు, కోమటిపల్లి పాఠశాలకు రూ.1.60 లక్షలు, సూర్యానాయక్‌తండా పాఠశాలకు రూ.1.35 లక్షలు, వీర్యానాయక్‌తండా పాఠశాలకు రూ.1.35 లక్షలు, గన్నెనాయక్‌తండా పాఠశాలకు రూ. 1.35 లక్షలు, కుంచమర్తి పాఠశాలకు రూ.1.35 లక్షలు, ఉయ్యాలవాడకు రూ.1.35 లక్షలు, తుంగగూడెంకు రూ 1.35 లక్షలు, కోడూరుకు రూ.1.60 లక్షలు, లోయపల్లికి రూ.1.35 లక్షలు, నాన్యతండాకు రూ.1.35 లక్షలు, వేల్పుచర్ల ప్రాథమిక పాఠశాలకు రూ.1.35 లక్షల చొప్పున మంజూరయ్యాయి. ఈ నిధులతో మరుగుదొడ్ల మరమ్మతు, ఎలక్ట్రికల్ పనులు, తాగునీటి ఏర్పాటు తదితర మౌలిక వసతులను కల్పించనున్నారు.


పాఠశాలల్లో పనులను ప్రారంభించాం



మండలంలోని వివిధ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు రూ.30.40 లక్షలు మంజూరయ్యాయి. ఈ నిధులతో మరమ్మతు పనులు ప్రారంభించాం. ముఖ్యంగా మరుగుదొడ్ల మరమ్మతు, విద్యుత్, తాగునీటి సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం ఇచ్చాం. త్వరగా పనులు పూర్తిచేసేలా చూస్తున్నాం.

– అశోక్, పీఆర్ ఏఈ

మౌలిక వసతులు సమకూరనున్నాయి



వివిధ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు మంజూరైన నిధులతో అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీల ద్వారా పనులు జరుగుతున్నాయి. జిల్లా కలెక్టర్ వెంకటరావు మండలంలో జరుగుతున్న పనులను పరిశీలించారు. ఈ నిధులతో పాఠశాలల్లో మౌలిక వసతులు కలగనున్నాయి.

– డి.సందీప్‌కుమార్, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ

'ఉపాధి' పనుల పరిశీలన

చిలుకూరు : ఉపాధి హామీ కూలీలకు పని ప్రదేశాల్లో కనీస సౌకర్యాలు కల్పించాలని ఎంపీడీఓ గిరిబాబు సూచించారు. శనివారం చిలుకూరు మండలంలోని మాధవగూడెం గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పనులు జరిగే చోట ప్రధానంగా తాగునీరు అందుబాటులో ఉంచాలని చెప్పారు. పనులకు వచ్చిన వారి పేర్లు మాత్రమే మస్టర్ రాయాలని అన్నారు. అనంతరం గ్రామ పంచాయతీ కార్యాలయంలో రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కవిత తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

తిరుమలగిరి : తిరుమలగిరికి చెందిన మానసకు తల్లిదండ్రులు లేకపోవడంతో ఆమె వివాహానికి కడియం సోమక్క చారిటబుల్ ట్రస్టు తరఫున శనివారం రూ.5 వేల ఆర్థికసాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో వై.దీన్‌దయాళ్, చిలుక అశోక్, హనుమాన్, సంతోష్, ఉపేందర్ పాల్గొన్నారు.